70 ఏళ్ల వృద్ధుడిని..... కిలోమీటరు ఈడ్చుకెళ్లి..!!

మీసాలవాండ్లపల్లి ఘటనపై యాదవ సంఘం ఆగ్రహం.. బాధితులతో కలిసి ఎస్పీకి ఫిర్యాదు

....వృద్ధుడిపై దాడి అమానుషం.. బాధ్యులను ఉపేక్షించొద్దు" - లక్ష్మీనరసప్ప

....హత్యాయత్నం కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్

....చర్యలు తీసుకోకపోతే యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన - హెచ్చరిక



సీమవార్త

రాయల సీమ



అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

పేజీలు : 4

శుక్రవారం 13 నవంబర్ 2026

100 శాతం స్ట్రైక్ రేట్తో చారిత్రాత్మక విజయం..!!




.....కూటమి ప్రభుత్వములో విజయదుందుభి.

.... మడకశిర లో కూటమి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ.

రూజు.పాల్గొన్న ఎమ్మెల్యే ఎమ్మెస్







మడకశిర నవంబర్ 12 సీమ వార్త

పట్టణంలోని మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను కూటమి కైవసం చేసుకోవడంతో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ గురువారం అట్టహాసంగా సాగింది. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయోత్సాహాన్ని చాటుకున్నారు. ఈ ఘన విజయం ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన నమ్మకానికి, అభివృద్ధి మరియు సంక్షేమ పాలనకు నిదర్శనం అన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు కూటమికి అండగా నిలిచిన ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు జడ్పిటిసిలు గుండుమల చంద్రప్ప, సురేష్ లక్ష్మీ దేవమ్మ, శివ రుద్రప్ప, ప్రమీల, బి శ్రావణి, తెలిపారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన ర్యాలీ కనివిని ఎరగని రీతిలో చరిత్రలో చారిత్రాత్మకంగా నిలిచే విధంగా ఉందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, మున్సిపల్ నూతన చైర్మన్ గుండుమల శారద రాధా కృష్ణ, ఒక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, కన్వీనర్లు కళ్ళు మరీ నాగరాజు, ఈరన్న, తిప్పే స్వామి, లక్ష్మీ నరసప్ప, పట్టణ కన్వీనర్ నాగరాజు, సింగల్ విండో అధ్యక్షులు నరేష్ కన్నా, దాసిరెడ్డి, కుమారస్వామి, గణేష్, మద్దన కుంటప్ప, బీసీ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ వి ఎం పాండురంగప్ప, ఎంపీటీసీలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

డిగ్రీ ఉంటేనే సర్పంచ్.... జేసీ కొత్త రూల్స్..!!

.....తాడిపత్రి నుండి పల్లెల వైపు.. జేసీ ప్రభాకర్ రెడ్డి కొత్త వ్యూహం!

....జేసీ మార్క్ సెలక్షన్ మొదలైంది!! ....చదువుకున్న మహిళలకే పట్టాభిషేకం

తాడిపత్రి, నవంబర్ 12 సీమవార్త:



తాడిపత్రి పట్టణంలో గురువారం మాజీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. నేటి నుండి తాను పల్లెబాట పట్టనున్నట్లు ప్రకటించారు. రానున్న సర్పంచ్ ఎన్నికల్లో చదువుకున్న యువతి, యువకులకే అధిక ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చదువుకున్న వారు అయితేనే గ్రామాలను అభివృద్ధి చేయగలరని అన్నారు. "గ్రామాన్ని నడిపేది డిగ్రీ కాదు, చదువుకున్న ఆలోచన.. అందుకే చదువుకున్న వారికే అవకాశం ఇస్తున్నాం" అని జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. రేపటి నుండి రోజుకో గ్రామంలో పర్యటించి, గ్రామ పెద్దలు, యువత, మహిళలతో నేరుగా మాట్లాడి అభ్యర్థులను ఎంపిక చేస్తామని ప్రకటించారు. గ్రామాలలో తిరిగి నాయకులతో చర్చించి చివరిగా సర్పంచ్ అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు. మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో 100% విజయం సాధించామని, రానున్న సర్పంచ్ ఎన్నికల్లో 100కు 100% విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అత్యధికంగా చదువుకున్న మహిళలకే అవకాశం ఇచ్చామని, సర్పంచ్ ఎన్నికల్లో కూడా చదువుకున్న మహిళలు ముందుకు వస్తే వారికి అవకాశం కల్పిస్తామని చెప్పారు. గత ఎన్నికల్లో డబ్బు, కులం చూసి టికెట్లు ఇచ్చిన వారికి ప్రజలే బుద్ధి చెప్పారని, ఈసారి చదువే ప్రామాణికమని జేసీ వ్యాఖ్యానించారు. సర్పంచ్ ఎన్నికల్లో తమ అభ్యర్థులు ఓడినా, గెలిచినా తాము బాధపడమని అన్నారు. అనంతపురం జడ్పీ వైస్ చైర్మన్ పదవిని తాము సూచించిన మహిళకు ఇవ్వాలని డిమాండ్ చేశామని, చివరకు ఏమైతుందో తెలియదని అన్నారు. "సర్పంచ్ అంటే పదవి కాదు.. బాధ్యత. ఆ బాధ్యతను చదువుకున్న మహిళల చేతిలో పెడతాం" అని చెప్పడంతో కార్యకర్తల్లో జోష్ నిండింది. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నదే తమ లక్ష్యమని జేసీ పిలుపునిచ్చారు.

గడువులోగా రీసర్వే లక్ష్యాలను పూర్తి చేయాలి..!!

జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ .....డిసెంబర్ లో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకే లక్ష్యంలి

.....3 డిఫెక్టివ్ గ్రామాల్లో పాస్ పుస్తకాల పంపిణీకి అధికారులకు ఆదేశం

.....గ్రామాల వివరాలు ఆన్ లైన్ లో నమోదుకు ఈ నెల 20 గడువు

పుట్టపర్తి, నవంబర్ 12 (సీమవార్త బ్యూరో) :



శ్రీ సత్యసాయి జిల్లాలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. ఎక్కడా జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గురువారం పుట్టపర్తి కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ లో రీసర్వే పనుల పురోగతిపై ప్రత్యేక పర్యవేక్షణ, సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో క్షేత్రస్థాయిలో రీసర్వే పనుల ప్రస్తుత స్థితిగతులను సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే డిసెంబర్ నెలలో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయడానికి లక్ష్యంగా నిర్దేశించుకున్న గ్రామాల వివరాలను ఈ నెల 20వ తేదీలోగా తప్పనిసరిగా ఆన్ లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న 3 డిఫెక్టివ్ గ్రామాలలో సాంకేతిక సమస్యలను సత్వరమే పరిష్కరించి, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్డీఓలు, ఇన్ స్పెక్టర్ ఆఫ్ సర్వే, డిప్యూటీ ఇన్ స్పెక్టర్ ఆఫ్ సర్వే, అన్ని డివిజనల్ డిపిసి సిబ్బంది, మండల తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రజల్లోకి 41వ వార్డ్ కౌన్సిలర్.. వీధి వీధికి పర్యటన!

విద్యుత్ లైన్ల సమస్యపై అధికారులతో కలిసి పరిశీలన



తాడిపత్రి, నవంబర్ 12 సీమవార్త: 41వ వార్డులో ప్రతి వీధిలో ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలు తెలుసుకొన కౌన్సిలర్ దిద్దకుంట రాణి. గురువారం వార్డులోని ప్రతి వీధికి వెళ్లి, ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను నోట్ చేసుకుని, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పర్యటనలో భాగంగా వీధిలో విద్యుత్ లైన్లు క్రిందగా వేలాడుతూ ఉండటాన్ని గమనించిన కౌన్సిలర్ , వెంటనే స్పందించారు. ఆ శాఖకు సంబంధించిన ఏఈ రాజారావు , లైన్ మెన్ రామాంజినేయులు , యూనిట్ ఇంచార్జ్ పావురాల శేనయ్యతో కలిసి వార్డులో పరిశీలించరు. ప్రమాదం జరగక ముందే లైన్లను సరిచేయాలని అధికారులకు సూచించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించగా చెత్త బండి, డ్రైనేజ్, మంచినీరు, వీధి దీపాలు అన్నీ సక్రమంగా ఉన్నాయని వార్డు ప్రజలు తెలిపారని ఆమె అన్నారు.వార్డులో పారిశుద్యం బాగుందని, నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేదని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారని ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తేవాలని కాలనీ వాసులను కోరారు.ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ పావురాల శేనయ్య, పుల్లయ్య, చంద్ర, శ్రీనివాసులు, వలి మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మున్సిపల్ పన్నుల వసూళ్లలో డిజిటల్ విధానం అమలు



మైదుకూరు, నవంబర్ 12, (సీమ వార్త) : మైదుకూరు పురపాలక సంఘం పరిధిలో ఆస్తిపన్ను, నీటిపన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులతో పాటు ఇతర మున్సిపల్ చెల్లింపులను ఇకపై ఆన్‌లైన్ విధానంలోనే స్వీకరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వై. రంగస్వామి తెలిపారు. పన్నుల వసూళ్లలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డులతో పాటు స్వర్ణ వార్డుల్లోనూ డిజిటల్ చెల్లింపుల విధానాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పన్నులను సకాలంలో ఆన్‌లైన్ ద్వారా చెల్లించి పురపాలక సంఘానికి సహకరించాలని కమిషనర్ కోరారు.

ఎనిమిది పట్టణ స్థానిక సంస్థల్లో 23న వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు



కడప, నవంబర్ 12, (సీమ వార్త) : జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 18న ప్రత్యేక సమావేశానికి సంబంధించి చైర్‌పర్సన్, వార్డు సభ్యులు, ఎక్స్-అఫీషియో సభ్యులకు నోటీసులు జారీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. నవంబర్ 23న ఉదయం 11 గంటలకు వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహిస్తామని, అనివార్య కారణాలతో ఆ రోజు సాధ్యం కాకపోతే నవంబర్ 24న ఉదయం 11 గంటలకు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆ రోజు కూడా ఎన్నిక జరగని పక్షంలో రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో రాజంపేట, ప్రొద్దుటూరు, పులివెందుల, బద్వేలు, మైదుకూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, కమలాపురం పట్టణ స్థానిక సంస్థల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయని వివరించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు



కడప, నవంబర్ 12, (సీమ వార్త) : జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డాక్టర్ నిధి మీనా పాల్గొన్నారు. ఎన్నికల ఏర్పాట్లు, భద్రతా చర్యలు, సిబ్బంది నియామకం తదితర అంశాలపై సమీక్ష అనంతరం కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల సామగ్రి పంపిణీ, సిబ్బందికి శిక్షణ, విధుల కేటాయింపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్ఓ మల్లికార్జునుడు, జిల్లా పంచాయతీ అధికారి రామచంద్ర తదితర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పారా స్పోర్ట్స్ (దివ్యాంగుల) ఎంపికల నిర్వహణ..

జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి. కిషోర్.



ధర్మవరం రూరల్ నవంబర్ 12 సీమ వార్త: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (షాప్) ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ వారి అనుమతితో, శ్రీ సత్య సాయి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పారా స్పోర్ట్స్ (దివ్యాంగుల) క్రీడాకారుల ఎంపిక పోటీలు ధర్మవరం లో నిర్వహించబడుతున్నాయి. అని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి. కిషోర్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం (డిసెంబర్ 3, 2026) సందర్భాన్ని పురస్కరించుకోని దివ్యాంగ క్రీడాకారులను ప్రోత్సహించడానికి మరియు వారికి మరిన్ని క్రీడా అవకాశాలు కల్పించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యమని వారు తెలిపారు. ఎంపికల వివరాలు తెలుపుతూ15-11-2026 (ఆదివారం) 13 సంవత్సరాలు పైబడిన బాలురు , బాలికలు మాత్రమే అర్హులు అని తెలిపారు.వేదికలు వివరాలు తెలుపుతూ పురుషుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ధర్మవరం,కళాజ్యోతి ఇండోర్ స్టేడియం, ధర్మవరం అని తెలిపారు.పోటీలు నిర్వహించే క్రీడాంశాలులో పారా-అథ్లెటిక్స్, పారా-బ్యాడ్మింటన్,వీల్‌చైర్ ఫెన్సింగ్,బ్లైండ్ గోల్‌బాల్, పారా-తైక్వాండో టేబుల్ టెన్నిస్ ఉంటాయని తెలిపారు.అర్హత , ఆసక్తి కలిగిన దివ్యాంగ క్రీడాకారులు ఆదివారం ఉదయం 8 గంటలకు 15-11-2026 తేదీన పురుషుల ప్రభుత్వ పాఠశాల ధర్మవరం నందు ఈ ఎంపికల్లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్: 9848187636 ద్వారా సంప్రదించాలన్నారు.

స్వకుల సాలి జాతీయ మహాసభలను విజయవంతం చేయండి..

పట్టణ అధ్యక్షులు సరోదే కృష్ణమూర్తి.



ధర్మవరం నవంబర్ 12 సీమ వార్త : స్వకుల సాలి జాతీయ మహాసభలు నవంబర్ 13, 14, 15, మూడు రోజులపాటు హైదరాబాద్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం ఎదురుగా కొత్తపేట లో నిర్వహిస్తున్నట్లు ధర్మవరం స్వకుల సాలి సంఘం అధ్యక్షులు సర్వదే కృష్ణమూర్తి, సభ్యులు భుజంగారావు, జుజారే నాగరాజు, గాంబ్లీ లక్ష్మణరావు, సర్వోదే సురేంద్రబాబు, రామకృష్ణ, నాగభూషణం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ మహాసభ 14వ మహాసభ అని తెలిపారు. దేశవ్యాప్తంగా నలుమూలల నుండి సమాజ బంధువులందరూ తోపాటు ఆంధ్రప్రదేశ్ కర్ణాటక మహారాష్ట్ర తెలంగాణ రాజస్థాన్ గుజరాత్ రాష్ట్రాల నుండి దాదాపు ఒక లక్ష 50 వేల మంది ఒకే చోట కలుసుకునే ఒక అపూర్వమైన చారిత్రాత్మకమైన మహా వేడుక అని ఇది తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా నుండి అధిక సంఖ్యలో స్వకుల సాలే సభ్యులందరూ కూడా ఈ మహాసభలకు బంధుమిత్ర సమేతంగా తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎన్నికైన జడ్పీటీసీ, ఎంపీటీసీలు

గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి -- జడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు సూచన



బొమ్మనహాల్, నవంబర్ 12 (సీమ వార్త): బొమ్మనహాల్ మండలంలో నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు రాయదుర్గం శాసనసభ్యులు కాల్వ శ్రీనివాసులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులకు పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని, మండల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా అందరూ సమష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో నూతన జడ్పీటీసీ సభ్యుడు కొత్తపల్లి మహేంద్ర, మండల కన్వీనర్ మల్లన్న, బొమ్మనహాల్ మండలానికి చెందిన 15 మంది ఎంపీటీసీ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్సిపి కార్యకర్తలకు అండగా స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వైసీ గోవర్ధన్ రెడ్డి



మడకశిర నవంబర్ 12 సీమ వార్త ఎన్నికల కౌంటింగ్ రోజు కూటమి ప్రభుత్వ దౌర్జన్యాలకు అరాచకాలకు నిరసనగా అమరాపురం జడ్పిటిసి అభ్యర్థి హలకూరు కాంతరాజు , అతనితోపాటు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు మల్లికార్జున, కృష్ణ మూర్తి, గాలి దానే గౌడ, దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు హనుమంతు, మిగతా దాదాపు 60 మంది పైన అక్రమ కేసు బనాయించడం జరిగింది, ఇందులో భాగంగా రిమాండ్ ఇవ్వడం జరిగింది . మడకశిర న్యాయ స్థానంలో అడ్వకేట్ వైసి గోవర్ధన్ రెడ్డి , అడ్వకేట్ అశ్వర్థ నారాయణ బలమైనటువంటి వాదనలు వినిపించి వైఎస్ఆర్సిపి నాయకులను రిమాండ్కు వెళ్లకుండా చేయడం జరిగింది. వీరితోపాటు పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యదర్శి నాగభూషణ్ రెడ్డి, ఆగలి మండలం జడ్పిటిసి అభ్యర్థి వెంకటస్వామి , టౌన్ నాగరాజు , రవితేజ, ఇతర ముఖ్య నాయకులు కార్యకర్తలు రావడం జరిగింది.

గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించండి..

ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి శివప్రసాద్.





ధర్మవరం నవంబర్ 12 సీమ వార్త: పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల ప్రధాన పౌర శాఖ గ్రంథాలయంలో నవంబర్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించబడే గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి శివప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ఆకస్మికంగా గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వార్షిక తనిఖీలో భాగంగా రికార్డులను పరిశీలించడం జరిగిందని తెలిపారు. అనంతరం 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను వారు విడుదల చేశారు. నవంబర్ 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారుల గూర్చి వివరణ, వ్యాసరచన, 17న కవి సమ్మేళనం, 18న చిత్రలేఖనం, 19న ఉమెన్స్ డే తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.ధర్మవరం పరిసర ప్రాంతాల విద్యార్థులకు పుర ప్రజలకు గ్రంథాలయంలో భాగస్వామ్యం అయ్యేలా చర్యలు చేపట్టాలని వారు ఆదేశించారు. అదేవిధంగా సభ్యత్వం పెంచే విధంగా కృషి చేయాలని తెలిపారు. గ్రంథాలయ శిష్యును వసూలు చేసి గ్రంధాలయ అభివృద్ధికి కృషి చేయాలని వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి, సిబ్బంది చెన్నకేశవులు, రాము, శివమ్మ, రమణా నాయక్, గంగాధర్, పాఠకులు పాల్గొన్నారు.

రాయలచెరువు ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ పరిశీలన

గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య పరిసరాల పరిశుభ్రత అవగాహన





యాడికి నవంబర్ 12 (సీమ వార్త)యాడికి మండలం రాయలచెరువు గ్రామంలో జిల్లామలేరియా అధికారి డాక్టర్ మనోజ్ ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరాజన్ డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ ను పరిశీలించడం జరిగింది ల్యాబ్ టెక్నీషియన్ సాయి లతాకు రికార్డులన్నీ సక్రమంగా రాయవలెను తెలియజేయడం జరిగింది అలాగే చందన సచివాలయము లక్ష్మి పల్లి సచివాలయము నుండి వచ్చిన గర్భవతులకు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత మరియు డ్రైడే ఫ్రైడే గురించి వివరించి ఇంటి ముందర మురికి కాలువల నందు నీరు నిల ఉండకుండా చూసుకోవాలని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు పిహెచ్ఎన్ గంగాదేవి ఏఎన్ఎం రజిని అనిత ఎం.ఎల్.హెచ్.పిలు ఆశా కార్యకర్తలు మొదలగు వారు పాల్గొన్నారు


బ్యాంకు రుణాలు సక్రమంగా చెల్లిస్తే చక్కటి ప్రయోజనం చేకూర్తుంది..

మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజు.



ధర్మవరం రూరల్ నవంబర్ 12 సీమ వార్త: మెప్మాలో ఉన్నటువంటి సంఘముల వారు బ్యాంకు రుణాలు సక్రమంగా చెల్లిస్తే చక్కటి ప్రయోజనం చేకూర్చుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య, ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజు, జిల్లా మెప్మా అధికారి రమాదేవి, టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ పెనుబోలు విజయభాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణములోని పిఆర్టి వీధిలో గల కార్యాలయంలో పట్టణంలోని సమైక్యాల మహిళా రిసోర్స్ పర్సన్స్ లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఏం సి ఫై అవగాహన ఉండాలన్నారు. మన లెక్కలు అనే యాప్నువినియోగించుకోవాలన్నారు. సంఘ సభ్యుల వివరాలు ఆన్లైన్లో నమోదు జరగాలని, మహిళా ఆకాశం యాప్ పై అవగాహన ఉండాలని తెలిపారు. వీధి విక్రయదారులకు ఆర్థిక సహకారం కోసం ప్రభుత్వ పథకం అయినా ప్రధానమంత్రి స్వామీజీ నుండి ఋణం ఎలా పొందాలని అనేదానిపై కూడా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. తదుపరి ప్రభుత్వ ఆరోగ్యం గూర్చి అమలు చేస్తున్న పథకం ఆయుష్మాన్ భారత్ పై కూడా అవగాహన కల్పించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ సి ఎం ఎం లక్ష్మీనారాయణ, సి ఓ లు, స్లం సమైక్య ఆర్పీలు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి కార్తీక జ్యోతి కి భారీగా విరాళం



మడకశిర నవంబర్ 12 సీమ వార్త ఓం అరుణాచల శివాయ నమః 24-11-2026 కార్తీకపౌర్ణమి కార్తీక జ్యోతి కొరకు మడకశిర ప్రాంత భక్తులు ప్రతి సంవత్సరం భారీగా విరాళం అందజేయడం జరుగుతుందని దానిలోని భాగంగానే ఈసారి కూడా రూ 1,14,000 ఒక లక్ష పదునాలుగు వేలు రూపాయలు ఆలయ కమిటీ అధికారులకు గురువారం 10-30గంటలకు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం నకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరున అందరికీ ధన్యవాదములు తెలుపుచున్నా ము అని భక్తులు చంద్రమోహన్, ఎన్ సి వెంకటరాముడు తెలిపారు.

అనుమతులు లేకుండా చెట్లు నరికితే కఠిన చర్యలు

పచ్చదనాన్ని నాశనం చేస్తే ఉపేక్షించేది లేదు: రెవెన్యూ అధికారి ప్రమీలమ్మ



లేపాక్షి నవంబర్ 12 సీమ వార్త :మండల పరిధిలో పచ్చని చెట్ల నరికివేతపై రెవెన్యూ అధికారులు స్పందించారు. అనుమతులు లేకుండా చెట్లను నరికివేసే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని లేపాక్షి మండల రెవెన్యూ అధికారి ప్రమీలమ్మ హెచ్చరించారు. మండలంలోని కల్లూరు గ్రామ పొలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు సుమారు 15 చింత చెట్లను నరికివేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కల్లూరు గ్రామ పొలంలోని సర్వే నంబర్ 303-2 పరిధిలో దాదాపు 20 చెట్లు నేలకొరిగాయని, మరికొన్ని చెట్లను నరికేందుకు సిద్ధంగా ఉన్నారని కల్లూరు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పత్రికల ద్వారా తెలుసుకున్న రెవెన్యూ అధికారి ప్రమీలమ్మ స్పందిస్తూ, చెట్ల నరికివేతకు సంబంధించి నిబంధనలు, అనుమతులు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా ఎవరైనా చెట్లను నరికితే వారిపై చట్టప్రకారం, శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, పచ్చని చెట్లను కాపాడేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక గ్రామస్థులు కోరుతున్నారు.

బొమ్మనహల్ మండలంలో ఐదు కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ

బొమ్మనహల్, నవంబర్ 12 (సీమ వార్త): బొమ్మనహల్ మండలంలో రెండో విడత గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ పత్రాల స్వీకరణ కోసం అధికారులు ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల పేర్లు, వాటి పరిధిలోని గ్రామాల వివరాలు ఇలా ఉన్నాయి. 1. డి. హొన్నూరు -- స్వర్ణ గ్రామ కార్యాలయం: బొల్లనగుడ్డం, కల్లుహోళ, గోవిందవాడ, డి. హొన్నూరు.2. బొమ్మనహల్ -- ఎంపీడీవో, ఎంపీపీ కార్యాలయం: బొమ్మనహల్, నేమకల్, కురువల్లి, సిద్ధరాంపురం.3. ఉంతకల్ -- స్వర్ణ గ్రామ కార్యాలయం: ఉంతకల్, బండూరు, హరేసముద్రం.4. ఉద్దేహాల్ -- కో-ఆపరేటివ్ భవనం: ఉద్దేహాల్, లింగదహాల్, కొలగానహళ్లి, ఏలంజి.5. శ్రీధరఘట్ట -- స్వర్ణ గ్రామ కార్యాలయం: శ్రీధరఘట్ట, ఉప్పరహాల్, సింగనహళ్లి, గొనేహాల్.మొత్తం 19 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఈ ఐదు కేంద్రాల్లో నామినేషన్ పత్రాలను స్వీకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు తమ గ్రామాలకు కేటాయించిన కేంద్రాల్లో నామినేషన్లు సమర్పించాలని సూచించారు.

వైకాపా నుండి టిడిపిలో చేరిక



మడకశిర నవంబర్ 12 సీమ వార్త పట్టణంలో వైఎస్ఆర్సిపి కి ఎదురుదెబ్బ తగిలింది. మడకశిర ఎమ్మెల్యే టిటిడి పాలక మండలి సభ్యులు జిల్లా పార్టీ అధ్యక్షులు ఎమ్మెస్ రాజు , టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ శాసన మండల సభ్యులు గుండుమల తిప్పేస్వామి సమక్షంలో మాజీ కౌన్సిలర్ ఉమా శంకర్ , పట్టణ జనరల్ సెక్రెటరీ తిమ్మరాజు, కౌన్సిలర్ ఓం ప్రకాష్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలోకి చేరిన వైఎస్ఆర్సిపి నాయకుడు గొల్ల హరీష్ మాజీ వాలెంటర్ పట్టణ 23 వార్డుల మానిటరీ ఇంచార్జ్ టిడిపిలో చేరారు.

పంచాయితీ ఎన్నికల భద్రతపై పోలీసులకు డీఎస్పీ సూచనలు

గాండ్లపెంట నవంబర్ 12 సీమ వార్త....మండల కేంద్రంలోని పంచాయితీ నామినేషన్ కేంద్రాలను గురువారం డీఎస్పీ శివ నారాయణ స్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ సుంకు వెంకటసుబ్బయ్య సత్రంలో ఈనెల 13న బహిరంగ వేలం

ప్రొద్దుటూరు, నవంబర్ 12, (సీమ వార్త) : ప్రొద్దుటూరు పట్టణంలోని శ్రీ సుంకు వెంకటసుబ్బయ్య సత్రానికి సంబంధించిన వివిధ ఆస్తులు, సామగ్రి లీజు మరియు విక్రయానికి ఈనెల 13వ తేదీ శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సత్రం కార్యనిర్వాహణాధికారి ఏ. శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సత్రం పరిధిలోని మినీ కళ్యాణ మండపం, దాని వెనుక భాగంలో ఉన్న రెండు గదులు, పైభాగంలో ఉన్న ఒక గదికి కలిపి లీజు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటికి డిపాజిట్‌గా రూ.50,000 నిర్ణయించామన్నారు. అదేవిధంగా సత్రం ముందు భాగంలో ఉన్న కూలింగ్ షాపునకు రూ.1,000 డిపాజిట్‌తో వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సత్రానికి సంబంధించిన పాత కటాంజనం ఒకటి, పాత గట్లు మూడు, ఇత్తడి కలశం ఒకటి, నగారా సామగ్రిని కూడా బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. ఈ వేలం అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు సత్రం ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే ప్రతి పాటదారుడు రూ.2,000 డిపాజిట్‌ను నగదు రూపంలో చెల్లించాలని సూచించారు. వేలంలో అత్యధిక ధరకు పాట పాడిన వ్యక్తి నిర్ణయించిన పూర్తి మొత్తాన్ని చెల్లించి సామగ్రిని స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. లీజు వేలంలో పాల్గొనదలచిన వారు నిర్ణీత డిపాజిట్‌తో వేలం ప్రారంభమయ్యే సమయానికి హాజరుకావాలని ఈఓ శ్రీధర్ కోరారు.

రైతుల రుణాల్లో రూ.70 లక్షలకు గోల్‌మాల్

37 మంది రైతుల రుణాల్లో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు

రికార్డులు తనిఖీ చేస్తున్నామని తెలిపిన డీజీఎం నారాయణరాజు



టి సుండుపల్లి నవంబర్ 12సీమ వార్త మండల పరిధిలోని తిమ్మసముద్రం రైతు సహకార పరపతి సంఘంలో రైతుల రుణాల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. 37 మంది రైతులకు సంబంధించిన రుణాల్లో సుమారు రూ.70 లక్షలకు పైగా అక్రమాలు జరిగినట్లు బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై సహకార సంఘం పాలకవర్గ సభ్యులకు రైతులు ఫిర్యాదు చేశారు.రైతుల ఫిర్యాదు మేరకు సంబంధిత రికార్డులను పరిశీలిస్తున్నామని కడప సహకార సంఘ బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ నారాయణరాజు తెలిపారు. అయితే ఈ వ్యవహారంలో ఇప్పటివరకు ఎవరినీ సస్పెండ్ చేయలేదని ఆయన స్పష్టం చేశారు. రికార్డుల పరిశీలనలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది. రైతుల రుణాల వ్యవహారంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.


చెరుకువాండ్లపల్లి వాసికి ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ ప్రదానం



టి సుండుపల్లె నవంబర్ 12సీమవార్త మండల పరిధిలోని చెరుకువాండ్లపల్లి గ్రామానికి చెందిన పసుపుల రాజశేఖర్‌కు ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టా లభించింది. కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగానికి చెందిన ఆచార్య పుత్తా పద్మ మార్గదర్శకత్వంలో ఆటోగ్ర్యాఫియోగ్రఫీస్ అఫ్ సెలెక్ట్ ఇండియన్ ఉమెన్స్ ఆక్టివిస్ట్స్ ఏ స్టడీ(ఎంపిక చేసిన భారతీయ మహిళా ఉద్యమకారిణుల ఆత్మకథలపై అధ్యయనం) అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు. నవంబర్ 9న నిర్వహించిన పీహెచ్‌డీ వైవా వోస్ పరీక్షలో విజయవంతంగా తన పరిశోధనను సమర్థించుకోవడంతో విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసింది.ప్రస్తుతం తిరుపతి జిల్లా చిట్వేలు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా,ఎన్‌సీసీ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి ఆంగ్ల రిసోర్స్ పర్సన్‌గా ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యారంగంలో విశిష్ట సేవలకుగాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పురస్కారాలను అందుకున్నారు.తన పరిశోధనకు మార్గదర్శకత్వం వహించిన ఆచార్య పుత్తా పద్మకు రాజశేఖర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూనే డాక్టరేట్ సాధించిన రాజశేఖర్‌ను, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, మొదలగు అధికారులు, చెరుకువాండ్లపల్లి గ్రామస్థులు, బంధుమిత్రులు అభినందించారు.

అయ్యప్ప స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.20 వేల విరాళం

కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి దాతృత్వం చాటుకున్న ఈడిగ రమేష్ గౌడ్



లేపాక్షి, నవంబర్ 12 సీమ వార్త : లేపాక్షి మండల కేంద్రంలోని పాతూరులో వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయంగా నిలుస్తోంది. ఆలయ అభివృద్ధిలో తన వంతు భాగస్వామ్యంగా ఈడిగ రమేష్ గౌడ్ కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణ పనుల కోసం తన కుటుంబం తరఫున రూ.20,000 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. దేవాలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి ఈ ఆర్థిక సహాయాన్ని అందించడం విశేషం. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఈడిగ రమేష్ గౌడ్ కుటుంబానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆలయ పునర్నిర్మాణానికి సహకరించడం ఇతరులకు కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గురు స్వామి శ్రీనివాస్ కమిటీ సభ్యులు భక్తులు గ్రామస్తులు ఇతరులు పాల్గొన్నారు

చిన్నారుల్లో న్యుమోనియా లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు:

డీఎంహెచ్‌వో యుగంధర్



కడప, నవంబర్ 12, (సీమ వార్త) : ఐదేళ్లలోపు చిన్నారుల్లో న్యుమోనియా వ్యాధిని ముందుగానే గుర్తించి సకాలంలో చికిత్స అందించడంపై తల్లిదండ్రులకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి. యుగంధర్ సూచించారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా జిల్లాలో సాన్స్ అవగాహన కార్యక్రమాన్ని గురువారం కడప రిమ్స్ ఆసుపత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో వేగంగా శ్వాస తీసుకోవడం, ఛాతీ లోపలికి లాగడం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. తల్లిపాలు, సంపూర్ణ టీకాలు, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రతతో న్యుమోనియా ముప్పును తగ్గించవచ్చని తెలిపారు. నవంబర్ 12 నుంచి 2027 ఫిబ్రవరి 28 వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించడంతో పాటు వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్సపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ వంశీ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మొహమ్మద్ తాహా, వైద్యులు, పీజీ విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


న్యుమోనియా లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు.. వెంటనే వైద్యులను సంప్రదించాలి



ప్రొద్దుటూరు, నవంబర్ 12, (సీమ వార్త) : న్యుమోనియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ కాటారు మానస సూచించారు. ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా వైఎంఆర్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన పరిసరాలు, సకాలంలో వైద్య చికిత్సతో న్యుమోనియాను నివారించవచ్చన్నారు. తీవ్రమైన దగ్గు, అధిక జ్వరం, వేగంగా శ్వాస తీసుకోవడం, ఊపిరి తీసుకునేటప్పుడు ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. మాస్కులు ధరించడం, చేతులు తరచూ శుభ్రం చేసుకోవడం, పౌష్టికాహారం తీసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. సీఓఎంవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ న్యుమోనియా నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నవంబర్ 12 నుంచి 2027 ఫిబ్రవరి 28 వరకు సాన్స్ ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆరోగ్య సిబ్బంది సచివాలయాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు చేపడతారన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది, శిక్షణ నర్సింగ్ విద్యార్థులతో కలిసి పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

న్యాయవాదిపై ఎస్సై దాడి చేయడం సమంజసం కాదు..

ధర్మవరం న్యాయవాదులు తీవ్రంగా ఖండన.



ధర్మవరం రూరల్ నవంబర్ 12 సీమ వార్త : శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షి మండలంలోని ఎస్సై హిందూపురం న్యాయవాది వెంకటరెడ్డి వై దాడి చేయడం దారుణమని, అటువంటి ఎస్ఐపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ధర్మవరం న్యాయవాదులు ఈ విషయమై తీవ్రంగా ఖండించారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. తదుపరి వారు మాట్లాడుతూ వచ్చే రెండు రోజులు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు వారు అధికార పూర్వకంగా తెలియజేశారు. నిందితుడు పై వారెంట్ జారీ చేయడంలో ఎస్ఐ అత్యుత్సాహం చూపించి న్యాయవాది చేతుల నుంచి పేపర్లను లాక్కొని అడ్వకేట్ పై దాడి చేయడం ఇది చట్టరీత్యా నేరము అని వారు స్పష్టం చేశారు. లేపాక్షి ఎస్ఐ పై ఎస్పీ చర్యలు తీసుకునేంతవరకు మా పోరాటాలు ఆపము అని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణారెడ్డి, ఖరీఫ్, రంగరాజు భట్టార్, నరేష్, రంగనాయుడు, బాబా, పెద్దన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏపీఎస్టీఏ ప్రస్థానం.

-రెండేళ్లు పూర్తి చేసుకుని మూడవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న స్కూల్ టీచర్స్ అసోసియేషన్.

పెనుకొండ నవంబర్ 12సీమవార్త. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా, "బడి -- బాధ్యత -- భవిష్యత్తు" అనే నినాదంతో రెండు సంవత్సరాల క్రితం స్థాపించబడిన స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ నేటితో రెండేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని మూడవ సంవత్సరంలోకి అడుగుపెడుతోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాడిశెట్టి శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యలను గుర్తించి వాటిని సంబంధిత ఉన్నతాధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం గత రెండేళ్లుగా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సంఘం స్థాపించిన కొద్ది కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల ఆదరాభిమానాలను పొందుతూ, రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో సంఘాన్ని బలోపేతం చేసుకున్నామని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం, ఆత్మగౌరవం, ఉద్యోగ భద్రత కోసం ఏపీఎస్ టీఏ నిరంతరం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం వ్యక్తిగత విజ్ఞప్తులతో పాటు ఐక్య ఉద్యమాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం ముందు పలు ప్రధాన డిమాండ్లను ఉంచారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. జాప్యం లేకుండా 12వ పీఆర్సీ ని త్వరితగతి అమలు చేయాలి. పీఆర్సీ అమలులో మరింత ఆలస్యం జరిగే పరిస్థితుల్లో మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండు చేశారు. సీపీఎస్ నురద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను పారదర్శకంగా, నిర్ణీత కాలవ్యవధిలో నిర్వహించాలి అలాగే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తగినంత మంది ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారాన్ని తగ్గించి పూర్తిస్థాయిలో విద్యాబోధనకు అవకాశం కల్పించాలి. పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్, సరెండర్ లీవ్, ఇతర ఆర్థిక ప్రయోజనాలను వెంటనే మంజూరు చేయాలి. ఉపాధ్యాయుల సర్వీస్ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ వ్యవస్థను ఏర్పాటు



చేయాలి. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయులపై అనవసరమైన యాప్‌లు, ఆన్‌లైన్ నివేదికలు, ఇతర బోధనేతర బాధ్యతలను తగ్గించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ పునర్నిర్మాణ ప్రత్యేక పూజలు

ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు ముందుకు రావడం అభినందనీయం



లేపాక్షి, నవంబర్ 12 సీమ వార్త: లేపాక్షి మండల కేంద్రంలోని పాతూరులో కొలువుదీరిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ ఈ కార్యక్రమానికి రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్ జయప్ప, జిల్లా అధికార ప్రతినిధి ఆనంద్ కుమార్ హాజరై అయ్యప్ప స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తికావాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, వాటి అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని అన్నారు. ఆధ్యాత్మిక సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఆలయాల పరిరక్షణ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు, దాతలు అందిస్తున్న విరాళాలు, సహకారం అభినందనీయమని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అందరి సహకారంతో ఆలయ పునర్నిర్మాణ పనులను విజయవంతంగా పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ గురుస్వామి శ్రీనివాస్ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, అయ్యప్ప స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సాంకేతిక పరిశోధనలో సత్తా చాటిన కవిత

మెషీన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్‌పై అధ్యయనం

వెల్స్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్

పులివెందుల నవంబర్ 12 (సీమ వార్త)వేముల మండలం లోని స్థానిక పేర్నపాడు గ్రామం కి చెందిన వేముల జడ్పీటీసీ నాగెళ్ళ సత్య ప్రభావతమ్మ సాంబశివరెడ్డి కోడలు, నాగెళ్ళ పవన్ విశ్వేశ్వర రెడ్డి భార్య కవిత సాంకేతిక పరిశోధన రంగంలో ప్రతిభ చాటి డాక్టరేట్ పొందారు. భర్త నాగెళ్ళ పవన్ విశ్వేశ్వర రెడ్డి ప్రోత్సాహం తో వెలగపల్లి కవిత డాక్టరేట్ సాధించి విశేష గుర్తింపు పొందారు,వేముల మండలం పేర్నపాడు కి గుర్తింపు సాధించారు. పులివెందుల జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె చెన్నైలోని వెల్స్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. 'మెషీన్ లెర్నింగ్ అండ్ డీప్ లెర్నింగ్' అనే అంశంపై డాక్టర్ కె. ఉలగప్రియ మార్గదర్శకత్వంలో పరిశోధన పూర్తి చేసి ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ డాక్టరేట్ సాధించడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. తన పరిశోధనకు మార్గదర్శకత్వం వహించిన డాక్టర్ కె. ఉలగప్రియకు, ఉన్నత విద్యాభ్యాసం, పరిశోధనలో తనకు అండగా నిలిచిన భర్త విశ్వేశ్వర్ రెడ్డి,అత్త మామ లకు అలాగే కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనను ప్రోత్సహించిన అత్త,మామ,అలాగే అమ్మ నాన్న తో పాటు కళాశాల అధ్యాపకులు, సహచరులకు ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ పరిశోధన రంగంలో మరింత కృషి చేస్తూ, విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.మెషీన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ అనేవి కృత్రిమ మేధస్సులో కీలకమైన సాంకేతిక పరిజ్ఞానాలు. వీటి ద్వారా కంప్యూటర్లు సమాచారాన్ని విశ్లేషించి స్వయంగా నేర్చుకోవడంతో పాటు చిత్రాలు, శబ్దాలను గుర్తించడం, క్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలను కనుగొనడం సాధ్యమవుతుంది. ముఖ్యంగా వైద్యం, విద్య, పరిశ్రమలు, వ్యవసాయం, రవాణా వంటి అనేక రంగాల్లో ఈ సాంకేతికతల వినియోగం విస్తరిస్తోంది. భారీ స్థాయిలో సమాచారాన్ని వేగంగా విశ్లేషించి కచ్చితమైన అంచనాలను రూపొందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. భవిష్యత్తులో సాంకేతిక అభివృద్ధి, నూతన ఆవిష్కరణలకు ఈ పరిశోధనలు మరింత దోహదపడనున్నాయి. కవిత సాధించిన ఈ విజయంపై ఆమె భర్త విశ్వేశ్వర్ రెడ్డి, కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగెళ్ల సాంబశివారెడ్డి,వేముల జడ్పీటీసీ సత్య ప్రభావతమ్మ, జేఎన్టీయూ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. పేర్నపాడు గ్రామానికి చెందిన



ఆమె ఉన్నత విద్యా రంగంలో డాక్టరేట్ సాధించడం వేముల మండలానికి గర్వకారణమని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రెండు కార్లు ఎదురెదురుగా ఢీ.. మరో ముగ్గురికి గాయాలు

డి.హీరేహాల్, నవంబర్ 12 (సీమవార్త): మండలంలోని పులకుర్తి గేట్ సమీపంలోని పెద్ద వంక వద్ద గురువారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఎస్.ఆర్.కోట గ్రామానికి చెందిన పవన్ రెడ్డి పాముకాటుకు గురికావడంతో అతడిని



చికిత్స నిమిత్తం కారులో బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో పులకుర్తి గేట్ సమీపంలోని పెద్ద వంక వద్ద ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మల్లికార్జున రెడ్డి, బోయ చందు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి రక్తగాయాలు కావడంతో వారిని 108 అంబులెన్స్‌లో బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, పాముకాటుకు గురైన పవన్ రెడ్డి కూడా బళ్లారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు డి.హీరేహాల్ ఎస్సై గురుప్రసాద్ రెడ్డి తెలిపారు.

లీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

-- డీఐఓ ప్రభంజనైలు



బొమ్మనహాల్, నవంబర్ 12 (సీమ వార్త): బొమ్మనహాల్ మండలంలోని బలనగుడం మరియు డి వన్నూరు గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వే కార్యక్రమాన్ని డీఐఓ ప్రభంజనైలు, మండల తహసీల్దార్ రఘు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్వే పనుల పురోగతిని పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. రీసర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి రైతుకు సంబంధించిన భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీఐఓ ప్రభంజనైలు, తహసీల్దార్ రఘు సూచించారు. రైతులకు భూముల సర్వేకు సంబంధించి ఏవైనా సమస్యలు లేదా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ డిప్యూటీ సర్వే అధికారి ఆనంద్ నాయక్, విలేజ్ సర్వేయర్లు కాజు, మధు, వీఆర్ఏ పోతరాజు,రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ధర్మవరం యువకుడి ప్రమాద ఘటనపై మంత్రి తక్షణ స్పందన..

బాధిత కుటుంబానికి మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు పరామర్శ

ధర్మవరం రూరల్ నవంబర్ 12 సీమ వార్త : అన్నమయ్య జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మవరం, శాంతినగర్‌కు చెందిన మోహనకృష్ణ (23) తీవ్రంగా గాయపడిన విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ వెంటనే స్పందించారు. మదనపల్లిలో చికిత్స పొందుతున్న మోహనకృష్ణతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే వైద్యులతో మాట్లాడి యువకుడికి అందుతున్న చికిత్స వివరాలను తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అదేవిధంగా బాధిత యువకుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పాలని తన నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబును ఆదేశించారు. మంత్రి ఆదేశాల



మేరకు హరీష్ బాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబులేసు, టీడీపీ నాయకులు రాళ్లపల్లి బాబు, లతో కలసి శాంతినగర్‌లోని మోహనకృష్ణ నివాసానికి వెళ్లి ఆయన తల్లిదండ్రులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును, యువకుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మోహనకృష్ణకు మెరుగైన వైద్యం అందుతోందని, ఎలాంటి ఆందోళన చెందవద్దని, మంత్రి



సత్యకుమార్ యాదవ్ అండగా ఉంటారని భరోసా కల్పించారు. మోహనకృష్ణకు మెరుగైన వైద్యం అందించే విషయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని హరీష్ బాబు తెలిపారు.

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిసిన వన్నూరస్వామి

..,ప్రజాసేవకు ప్రాధాన్యతనిస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచన

...ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

రాయదుర్గం, నవంబర్ 12 (సీమవార్త): డి.హీరేహాల్ మండల నూతన జడ్పీటీసీ సభ్యుడు ఎం. బోయ వన్నూరస్వామి గురువారం రాయదుర్గంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన వన్నూరస్వామిని ఎమ్మెల్యే అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను గుర్తించి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. మండల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం వన్నూరస్వామి మాట్లాడుతూ.. తన విజయానికి సహకరించిన ప్రజలకు, కూటమి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్



హనుమంత రెడ్డి, మోహన్ రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మరెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ మల్లికార్జున, శ్రీనివాసులు రెడ్డి, హనుమంత రెడ్డి, బసవరాజు, గొల్ల సురేష్, కల్యం సురేష్, వెంకటేష్ రెడ్డి, నరసింహ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ రవి హామీని నెరవేర్చిన సింహాద్రిపురం జడ్పీటీసీ మారెడ్డి భరత్ రెడ్డి



పులివెందుల నవంబర్ 12 (సీమ వార్త) ఇంటి ఇంటికి తెలుగుదేశం కార్యక్రమంలో బోనాల గ్రామాన్ని సందర్శించిన సమయంలో పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి డప్పు కళాకారులకు డప్పులు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు గురువారం పులివెందుల టీడీపీ కార్యాలయంలో సింహాద్రిపురం జడ్పీటీసీ మారెడ్డి భరత్ రెడ్డి గారు డప్పు కళాకారులకు డప్పులను పంపిణీ చేశారు. బీటెక్ రవి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ డప్పులు అందజేయడంతో కళాకారులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, లింగాల మండల టీడీపీ ఇంచార్జ్ దేవిరెడ్డి సంజీవ రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి అజ్జగుట్టు రవితేజ రెడ్డి, బోనాల టీడీపీ నాయకుడు సోమశేఖర్ రెడ్డి,వెంకట్రామిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీమ వార్త
తెలుగు దినపత్రిక

పశుగ్రాసం కొరతపై సీఎం చంద్రబాబు తక్షణ కార్యాచరణ

మంత్రి సత్యకుమార్ విజ్ఞప్తితో రూ.కోటి విలువైన 250 టన్నుల మేత సరఫరాకు ఆదేశాలు



ధర్మవరం రూరల్ నవంబర్ 12 సీమ వార్త : ఎల్‌నినో ప్రభావంతో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పశు గ్రాసం కొరత తీవ్రంగా నెలకొన్న నేపథ్యంలో పశు పోషకులకు అండగా నిలిచేందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన తక్షణమే స్పందించి అధికారులను అప్రమత్తం చేశారు. రెండు జిల్లాల్లో పశుగ్రాసం లభ్యత, అవసరాలు, కొరత ఉన్న ప్రాంతాలపై సమీక్ష నిర్వహించి.. లోటు ఉన్న చోట్లకు వెంటనే మేత సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ మేరకు రూ.కోటి విలువైన 250 మెట్రిక్ టన్నుల పశుగ్రాసాన్ని తక్షణమే సరఫరా చేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్ర తెలిపారు. అధికారుల సమీక్షలో రెండు జిల్లాల్లో కలిపి సుమారు 11.04 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం కొరత ఉన్నట్లు వెల్లడైంది.కేబినెట్ సమావేశంలో మంత్రి ప్రస్తావన లో వారు మాట్లాడుతూ నవంబర్ 10న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పశుగ్రాసం కొరత అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వర్షాభావ పరిస్థితులు ఎక్కువగా ఉండే అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పశువులకు మేత అందుబాటులో లేకపోతే రైతులు, పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని వివరించారు. పశుసంపదను కాపాడటంతో పాటు పశుపోషకుల జీవనోపాధికి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా శ్రీ సత్యసాయి జిల్లాలో అన్ని సచివాలయాల పరిధిలో కొరత ఉందని తెలిపారు.ప్రస్తుతం 2,39,891 మెట్రిక్ టన్నుల పశు గ్రాసం అందుబాటులో ఉంది. 90 రోజుల అవసరాలకు 4,58,946 మెట్రిక్ టన్నులు కావాల్సి ఉండగా.. 2,19,055 మెట్రిక్ టన్నుల లోటు ఏర్పడింది అని తెలిపారు.రెండు జిల్లాల్లో పశుగ్రాసం కొరత తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సరఫరాకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్ర తెలిపారు. పశుగ్రాసం కొరతతో రైతులు, పశు పోషకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

పేదలకు ఆర్థిక భరోసా సీఎంఆర్ఎఫ్ నిధులు

సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం





గుంతకల్ నవంబర్ 12 సీమా వార్త గురువారం రోజున గుంతకల్లు పట్టణం ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయం నందు సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం మరియు వారి సోదరుడు గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి హాజరు కావడం జరిగినది ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యం బాగాలేక హాస్పిటల్లో ట్రీట్మెంట్ తీసుకున్న వారికి పేదవారి కుటుంబానికి పెద్ద కొడుకుల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలిపారు అలాగే ఈ రోజున గుంతకల్లు నియోజకవర్గం దాదాపు 2 సంవత్సరాలలో 1200 మందికి గాను 7 కోట్ల 39 లక్షల 710 రూపాయలు అందించిన ఘనత బడుగు బలహీన వర్గాల ముద్దు బిడ్డ మన గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం దక్కుతుంది అలాగే ఈరోజు దాదాపుగా 41,42,34వ విడతలతో కలిపి 44 మంది గాను 25,24,020 రూపాయలు నిరుపేద కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఆర్థిక సహాయం చేయడం జరిగినది.సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ చెక్కుల లబ్ధిదారులు మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గం లో జరిగిన స్థానిక సంస్థ ఎన్నికలలో మన కూటమి ప్రభుత్వం తరఫున పోటీ చేసిన వారిని గెలిపించి గుంతకల్లు నియోజకవర్గం నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు బహుమతిగా ఇచ్చాము అని ఈ సభముఖంగా తెలియజేస్తున్నాము అలాగే జరగబోయే స్థానిక సంస్థ గ్రామ సర్పంచులు కూడా గెలిపించుకొని తీరుతామని తెలియజేస్తున్నాము. కూటమి ప్రభుత్వానికి మరియు గుమ్మనూరు కుటుంబానికి రుణపడి ఉంటామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, గుంతకల్ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్, బిఎస్ కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షులు గుణశేఖర్, కౌన్సిలర్లు, నందీశ్వర్, రమేష్ గౌడ్, యూనిస్, ప్రభాకర్, సీనియర్ నాయకులు తలారి మస్తానప్ప, అమ్లెట్ మస్తాన్ యాదవ్, శివన్న, సుధాకర్, పెదబాబు,చంద్రయ్య,ఫజల్ మరియు గుంతకల్లు నియోజకవర్గం కూటమి కౌన్సిలర్స్ మరియు నాయకులు కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు మహిళలు పెద్ద ఎత్తున హాజరు కావడం జరిగినది.

సురక్ష కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి

పులివెందుల నవంబర్ 12 (సీమ వార్త):ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి నిర్వహిస్తున్న మొబలైజేషన్ ఆఫ్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమాలను ఎన్జీవోలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లాల ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి వేంపల్లి భాస్కర్ అన్నారు.జణూ ఎన్జీవో కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బందితో జరిగిన సమావేశంలో మిషన్ ఎయిడ్స్ సురక్ష(హీూూ) కార్యక్రమాల టార్గెట్లను వివరించారు. ఇచ్చిన టార్గెట్ ను సకాలంలో పూర్తి చేయాలన్నారు. హైరిస్క్ గ్రూపులను గుర్తించి వారికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు, కౌన్సెలింగ్, మందుల సరఫరా విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. హెచ్ఐవి స్క్రీనింగ్ లక్ష్యాలను 95 శాతం వరకు చేరుకోవాలని, అలాగే హెచ్ఐవి ఉన్న వారిలో 95 శాతం మందికి చికిత్స అందించాలన్నారు. వైరల్ లోడ్ నియంత్రణలో 95శాతం లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లోని ఐసీటీసీ, డీఎస్ఆర్సీ, రక్తనిధి మరియు లింక్ ఏఆర్టీ కేంద్రాలను సందర్శించి, ఆయా కేంద్రాల్లోని రికార్డులు మరియు కార్యక్రమాల అమలు తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, రికార్డుల నిర్వహణలో లోపాలు ఉన్నా సంబంధిత బాధ్యులపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాల లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో , ప్రివెన్షన్ ఆఫీసర్ ఆనంద్ కుమార్, ఐసీటీసీ కౌన్సిలర్ సుబ్బయ్య, కౌన్సిలర్ భదర్ వలి, రక్తనిధి టెక్నీషియన్ రాజు, సీడీఎస్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



పులివెందుల ఆర్టీసీ లో వివాదాస్పదంగా మారిన డ్యూటీ చార్ట్ కౌన్సిలింగ్ ప్రక్రియ



పులివెందుల నవంబర్ 12 (సీమ వార్త): పులివెందుల ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్ల డ్యూటీ చార్ట్ కౌన్సిలింగ్ ప్రక్రియపై వివాదం నెలకొంది. ఏడాదికి ఒకసారి నిర్వహించే ఈ ప్రక్రియను సంబంధిత పర్యవేక్షణాధికారుల సమక్షంలోనే చేపట్టాల్సి ఉండగా, ప్రస్తుతం ఆ పోస్టులు ఖాళీగా ఉండటంతో కౌన్సిలింగ్ నిర్వహణపై కార్మికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా అధికారుల పర్యవేక్షణలో ప్రక్రియ చేపట్టాలని, లేదంటే తాత్కాలికంగా నిలిపివేయాలని పలువురు ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్టీసీలో ప్రతి ఏడాది డ్రైవర్లు, కండక్టర్లకు డ్యూటీ చార్ట్ కౌన్సిలింగ్ నిర్వహించడం ఆనవాయితీ. పులివెందుల డిపోలో సీనియర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్, చీఫ్ ఇన్స్పెక్టర్ సమక్షంలో ఈ ప్రక్రియ జరగాల్సి ఉంది. అయితే గత కొంతకాలంగా ఈ రెండు కీలక పోస్టులు భర్తీ కాకపోవడంతో పర్యవేక్షణ బాధ్యతలు ఎవరు నిర్వహిస్తారన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇదిలా ఉండగా శుక్రవారం డ్రైవర్లు, కండక్టర్ల డ్యూటీ చార్ట్ కౌన్సిలింగ్ నిర్వహించాలని సంబంధిత ఉద్యోగులకు ఓ అధికారి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అయితే ఆ ఆదేశాలు జారీ చేసిన ఉద్యోగి సెలవుపై వెళ్లడంతో కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహణపై మరింత సందిగ్ధత నెలకొంది. పర్యవేక్షించాల్సిన అధికారులు అందుబాటులో లేని పరిస్థితుల్లో హడావుడిగా కౌన్సిలింగ్ చేపట్టడం ఎంతవరకు సమంజసమని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. డ్యూటీ చార్ట్ అనేది ఉద్యోగుల విధి నిర్వహణకు సంబంధించిన కీలకమైన అంశం. ఇలాంటి ప్రక్రియలో పారదర్శకత, సమానత్వం, అధికారిక పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. సంబంధిత అధికారులు లేకుండానే కౌన్సిలింగ్ నిర్వహిస్తే భవిష్యత్తులో అభ్యంతరాలు, వివాదాలు తలెత్తే అవకాశముందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద పర్యవేక్షణాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్న నేపథ్యంలో డ్యూటీ చార్ట్ కౌన్సిలింగ్ నిర్వహణపై ఆర్టీసీ యాజమాన్యం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. సంబంధిత అధికారులను నియమించి వారి సమక్షంలో పారదర్శకంగా కౌన్సిలింగ్ నిర్వహించాలా? లేక అప్పటివరకు ప్రక్రియను వాయిదా వేయాలా? అన్నది ఉన్నతాధికారులు తేల్చాలని కార్మికులు కోరుతున్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడు మృతి.. కోమటికుంట్లలో విషాద ఛాయలు

కుక్కను తప్పించబోయి కిందపడిన ఇస్మాయిల్

తాడిపత్రి, నవంబర్ 12 సీమవార్త: తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొనుగుంటపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉలవపల్లి ఇస్మాయిల్ (23) అనే యువకుడు మృతి చెందాడు. పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామానికి చెందిన ఉలవపల్లి ఇస్మాయిల్ ఈ నెల 12.11.2026వ తేదీ మధ్యాహ్నం పని నిమిత్తం తన మోటార్ సైకిల్ పై తాడిపత్రికి వచ్చాడు. అనంతరం సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా, తాడిపత్రి – పుట్లూరు రహదారిలోని కొనుగుంటపల్లి గ్రామ సమీపంలో అకస్మాత్తుగా కుక్క రోడ్డుకు అడ్డంగా రావడంతో దానిని తప్పించబోయి మోటార్ సైకిల్ పై నియంత్రణ కోల్పోయి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఇస్మాయిల్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అంబులెన్స్ ద్వారా తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఉలవపల్లి ఇస్మాయిల్ వలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చెప్పటారు.

దోమలు నిర్వహణపై విద్యార్థులు ర్యాలీ.. ప్రజలకు అవగాహన



బొమ్మనహల్ నవంబర్ 12: (సీమ వార్త)బొమ్మనహల్ మండలంలోన శ్రీధర్‌గట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మైలాపురం గ్రామంతో పాటు దేవగిరి గ్రామంలోనూ దోమల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా “దోమ చిన్నదే.. కాటు పెద్ద ప్రమాదం”, “దోమ పుట్టకూడదు.. కుట్టకూడదు” అనే నినాదాలతో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇటీవల కురుస్తున్న తేలికపాటి వర్షాలు, వరి పంట సాగు కారణంగా దోమల ఉద్ధృతి పెరిగే అవకాశం ఉందని, వీటి ద్వారా డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, పైలేరియా, కాలాజార్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆరోగ్య సిబ్బంది ప్రజలకు వివరించారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కిటికీలకు వైర్‌మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నీటి నిల్వ పాత్రలకు మూతలు పెట్టాలని, పాత టెంకాయ చిప్పలు, టైర్లు, పాత రోళ్లు తదితర వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. సాయంత్రం వేళల్లో దోమతెరలు ఉపయోగించాలని, దోమకాటుకు గురికాకుండా శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ, గోవర్ధన్, రమాదేవి, ఆశా కార్యకర్తలు గిరిజ, శ్రావణి, లక్ష్మీదేవితో పాటు విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణ, డంపింగ్ యార్డు అభివృద్ధికి ప్రత్యేక నిధులు



ప్రొద్దుటూరు, నవంబర్ 12, (సీమ వార్త) : ప్రొద్దుటూరు పట్టణంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.1.38 కోట్ల నిధులు విడుదలైనట్లు మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఘన వ్యర్థాల నిర్వహణ పథకం కింద రూ.1,38,07,202 మంజూరైనట్లు గురువారం వెల్లడించారు. ఈ నిధుల్లో పాత చెత్త తొలగింపునకు రూ.46,02,401, తడి, పొడి చెత్త నిర్వహణకు రూ.46,02,401, ఇతర ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలకు రూ.46,02,401 కేటాయించినట్లు వివరించారు. నిధులను నిబంధనల ప్రకారం పారదర్శకంగా వినియోగించి పాత చెత్త తొలగింపు, డంపింగ్ యార్డు అభివృద్ధి, శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాల నిర్వహణ చేపడతామన్నారు. పట్టణ ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించి మున్సిపాలిటీకి సహకరించాలని కమిషనర్ కోరారు.

శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం.





గుంతకల్ నవంబర్ 12 సీమా వార్త గుంతకల్ స్థానిక శ్రీ శంకరానంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా గురువారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన ఆయుధమని, దేశ విద్యాభివృద్ధికి ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయము అన్నారు. అందరికీ చదువు అందించడం కోసం ఆయన ఎనలేని సేవలు అందించారని,దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా ఆధునిక విద్యా వ్యవస్థకు పునాదులు వేసిన రూపశిల్పి ఆయన అని తెలిపారు. విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆయన సూచించారు. ఆజాద్ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని, విద్యావేత్త, దార్శనీకుడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.సురేష్ బాబు,అధ్యాపకులు డాక్టర్ నటరాజ్,రాకేష్,కళాశాల అధ్యాపక, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సీమ వార్త
తెలుగు దినపత్రిక

ఎమ్మెల్యే జన్మదినం పురస్కరించుకుని అగస్త్యేశ్వరుడికి పంచామృతాభిషేకం



ప్రొద్దుటూరు, నవంబర్ 12, (సీమ వార్త) : ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి 85వ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక శ్రీ గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ అర్చకులచే స్వామివారికి, అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు జరిపించారు. అనంతరం మున్సిపల్ ప్రతిపాదిత చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ కేక్ కట్ చేసి భక్తులకు, వేద పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, అర్చకులు, ప్రముఖులు, భక్తులు, ఎమ్మెల్యే అభిమానులు పాల్గొన్నారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీ నవంబర్ 19న ఎన్నిక.....



గాండ్లపెంట నవంబర్ 12 సీమ వార్త....మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మండల ప్రత్యేక అధికారి మోహన్ రామ్, ఎంపీడీవో రామకృష్ణ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన నిర్వహించే ప్రత్యేక సమావేశంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీతో పాటు మండల కో ఆప్షన్ సభ్యుడిని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. చేతులెత్తే పద్ధతిలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఎంపీటీసీ సభ్యులకు ఇప్పటికే నోటీసులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.ఫోటో... సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి...

అన్నదానంతో ప్రజల మధ్య ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రొద్దుటూరు, నవంబర్ 12, (సీమ వార్త) : ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి 85వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణ టీడీపీ అధ్యక్షుడు, 27వ వార్డు కౌన్సిలర్ చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అస్వర్ థియేటర్ వద్ద మున్సిపల్ ప్రతిపాదిత చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డి కేక్ కట్ చేసి అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలకు భోజనం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఇన్‌చార్జి చైర్మన్ పట్నం లక్ష్మణ్, టీడీపీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి, 26వ వార్డు ఇన్‌చార్జి నూరీ, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు, శివాలయం పాలకమండలి సభ్యుడు బాబు, చల్లా రవిశంకర్ యాదవ్, మూరబోయిన శ్రీనివాస్ యాదవ్, చింతల రాఘవేంద్ర యాదవ్, బంగి శివప్రసాద్, కర్ణ యాదవ్, రామచంద్రరాజు, హరి, పూల భాష, నల్లం రవిశంకర్, ఏసునాథరెడ్డి, నేలటూరు సంజీవరాయుడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రొద్దుటూరు, నవంబర్ 12, (సీమ వార్త) : ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి 85వ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ ప్రతిపాదిత చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. ఈ సందర్భంగా నంద్యాల రాఘవరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి ఆయన మరింత కృషి చేయాలని కోరారు. మాజీ జిల్లా ఆసుపత్రుల చైర్మన్ బద్వేలు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సంపూర్ణ ఆరోగ్యంతో, సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షుతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉట్టి శారద, ఉట్టి సాయి నికిత, వై.ఎస్. ఆరిఫ్, మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్. రమేష్, శానిటరీ సూపర్‌వైజర్ ఎస్. నూర్ భాషా, యూనియన్ నాయకుడు సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి జన్మదిన వేడుకలు.. పేట వెంకట రమణ ఆధ్వర్యంలో అన్నదానం



ప్రొద్దుటూరు, నవంబర్ 12, (సీమ వార్త) : ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి 85వ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద పేట వెంకట రమణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ప్రజలకు అన్నదానం చేశారు. పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పేట వెంకట రమణ మాట్లాడుతూ నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రజల అభిమానం పొందిన నాయకుడిగా నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ప్రొద్దుటూరును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు జీవిస్తూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు నాయకత్వం వహించాలని ఆకాంక్షించారు.

సేవా కార్యక్రమాలతో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రొద్దుటూరు, నవంబర్ 12, (సీమ వార్త) : ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి 85వ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ ప్రతిపాదిత చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. ఈ సందర్భంగా నంద్యాల రాఘవరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి ఆయన మరింత కృషి చేయాలని కోరారు. మాజీ జిల్లా ఆసుపత్రుల చైర్మన్ బద్వేలు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సంపూర్ణ ఆరోగ్యంతో, సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షుతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉట్టి శారద, ఉట్టి సాయి నికిత, వై.ఎస్. ఆరిఫ్, మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్. రమేష్, శానిటరీ సూపర్‌వైజర్ ఎస్. నూర్ భాషా, యూనియన్ నాయకుడు సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చే సన్న బియ్యం అమ్మకాలు.



హిందూపురం, నవంబర్ 12 సీమ వార్త. మండల ప్రజలకు తెలియచేయడం ఏమనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరా కమీషనర్ , సత్యసాయి జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రస్తుతం బియ్యం ధరలు బహిరంగ మార్కెట్ లో నాణ్యమైన సన్న బియ్యం ప్రజలకు అందించే చర్యలు చేపట్టిందన్నారు.బియ్యం ధరలు భారీగా పెరగటం వలన ప్రజలు బియ్యం విక్రయాలు చేయటానికి ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరా సంస్థ ద్వారా ధరణి నాణ్యమైన సన్న బియ్యం కేఎన్ఎం రకం రూ.50 రూ లకు ఒక కుటుంబానికి నెలకు 26 కేజీలు రూ. 1300 లకు విక్రయం చేపడుతోందన్నారు. సదరు సన్న బియ్యం అమ్మకాలు తేదీ 13 వ తేదీ నుంచి హిందూపురం పట్టణం లోని మునిసిపల్ కాంప్లెక్స్ రూమ్ నెం. 14 లో స్పెషల్ కౌంటర్ ద్వారా విక్రయం జరుగుతుంది. ఈ అవకాశాన్ని కార్డుదారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనదనీ రెవెన్యూ అధికారులు తెలియజేశారు.

శత్రువుకు కోలుకునే అవకాశం ఇవ్వొద్దు..

న్యూఢిల్లీ: మారుతున్న ప్రపంచ యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా భారత త్రివిధ దళాలు తమ రక్షణ, దాడి సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోవాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. శత్రువుకు కోలుకునేందుకు, ప్రతిస్పందించేందుకు అవకాశం ఇవ్వకుండా సమర్థవంతంగా ఎదురుదాడి చేసే సామర్థ్యాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో శత్రువుల నుంచి ఎదురయ్యే ఆకస్మిక దాడులను ముందుగానే గుర్తించి తిప్పికొట్టేలా నిఘా వ్యవస్థలను పటిష్ఠం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఢిల్లీలో నిర్వహించిన భారత వైమానిక దళ (ఐఏఎఫ్) కమాండర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక యుద్ధ రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, భవిష్యత్ రక్షణ వ్యూహాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై కీలక సూచనలు చేశారు.

యుద్ధ రంగంలో కొత్త సవాళ్లు

ప్రస్తుత యుద్ధాలు సంప్రదాయ సరిహద్దులకే పరిమితం కావడం లేదని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, సైబర్ దాడులు, అంతరిక్ష రంగాల్లోనూ యుద్ధ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో క్షిపణులు, డ్రోన్లు, అధునాతన ఆయుధ వ్యవస్థల వినియోగం కీలకంగా మారిందన్నారు. అభివృద్ధి చెందుతున్న యుద్ధ రంగాలకు అనుగుణంగా ప్రత్యేక వ్యూహాలు, కార్యాచరణ విధానాలను రూపొందించుకోవాలని సూచించారు.

డ్రోన్ల దాడులను ఎదుర్కొనేలా సిద్ధం కావాలి

రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణలను ప్రస్తావించిన రక్షణ మంత్రి.. ఆధునిక యుద్ధాల్లో డ్రోన్లు, గగనతల రక్షణ వ్యవస్థలు ఎంత కీలకంగా మారాయో వివరించారు. ఆత్మాహుతి డ్రోన్లు, నిఘా డ్రోన్లు, డ్రోన్ వ్యతిరేక కార్యకలాపాలు సైనిక బలగాలకు కొత్త సవాళ్లను విసురుతున్నాయని చెప్పారు. వీటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక కౌంటర్

లేపాక్షి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

- విధులు బహిష్కరించిన న్యాయవాదులు.



హిందూపురం: నవంబర్ 12 సీమ వార్త. విధి నిర్వహణలో ఉన్న న్యాయవాది వెంకటరెడ్డిపై దాడి చేసిన లేపాక్షి ఎస్సై నరేంద్ర పై చర్యలు తీసుకోవాలని హిందూపురం న్యాయవాదుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఎస్సై చర్యలను నివసిస్తూ గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, ఈ నెల 10వ తేదీన మత్తూరు మాజీ ఎంపీపీ పురుషోత్తం రెడ్డిని పోలీసుల అక్రమంగా అరెస్టు చేయడం జరిగిందన్నారు. న్యాయవాదిగా పురుషోత్తమ రెడ్డికి బెయిల్ వేసేందుకు వెంకటరెడ్డి ఆయన సంతకాల కోసం వెళ్లగా లేపాక్షి ఎస్ఐ నరేంద్ర న్యాయవాది చేతుల్లో ఉన్న కాగితాలను బలవంతంగా లాక్కోవడమే కాకుండా దాడికి ప్రయత్నించడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. పోలీసులు అక్రమంగా అరెస్టు చేస్తే బాధితుల తరఫున తాము న్యాయవాదులుగా బెయిల్ వేయడం కోసం ప్రయత్నిస్తే ఇలా అడ్డుకోవడం తగదన్నారు. ఇటీవల కాలంగా న్యాయవాదులపై పోలీసుల దాడులు పెరిగిపోతున్నాయని, ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉద్ధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రామచంద్రారెడ్డి, ఇందాద్, వెంకటరెడ్డి, కృష్ణమూర్తి, నాగరాజు రెడ్డి, సదాశివరెడ్డి, హిదయతుల్లా ఖాన్, ఆసిఫ్, రకీబ్, అభిజిత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల సంయుక్త పరిశీలన.



హిందూపురం: నవంబర్ 12 సీమ వార్త. హిందూపురం మండల పరిధిలోని గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను మానేసముద్రం, మలుగురు, బా లంపల్లి, చలి వెందుల, బీరేపల్లి, కగ్గల్లు తదితర పంచాయతీలను మండల అధికారులు, పోలీస్ అధికారులతో సంయుక్తంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు జారీ చేశారు.

ముకుమ్మడిగా ఏకతాటిపై నడుస్తాం... టిడిపి అభ్యర్థిని గెలిపించుకుంటాం

ఓడి చెరువు సర్పంచ్ అభ్యర్థిగా ఉమే షరా బేగంను బలపరిచిన టిడిపి శ్రేణులు



ఓబులదేవరచెరువు (నవంబర్13)సీమ వార్త:ఓడిచెరువు గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా ఉమేషరాబేగంను మూకుమ్మడిగా ఏ కతాటిపై నడిచి గెలిపించుకుంటామని టిడిపి శ్రేణులు ఉద్ఘాటించారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ జడ్పిటిసి పిట్టా ఓల్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం టిడిపి నాయకులు,కార్యకర్తలు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా టిడిపి శ్రేణులు ఓడి చెరువు గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిని ఏకగ్రీవంగా బలపరిచి ఎన్నుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ... గ్రామపంచాయతీ పరిధిలోని టిడిపి నాయకులు,కార్యకర్తలు,అభిమానుల సలహా, సూచనలతో అభ్యర్థిని ఎంపిక చేశామన్నారు. ఓడి చెరువు మండల కేంద్రానికి చెందిన తుమ్మల మహబూబ్ బాషా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గత 20 ఏళ్లుగా పార్టీ పనిచేస్తూ టిడిపి అభివృద్ధికి కృషి చేసారు.ఆయన సతీమణి ఉమేషరా బేగం.....ఓడి చెరువు గ్రామపంచాయతీ(బీసీ) ఉమెన్ రిజర్వేషన్ లో భాగంగా ఆమె కు అవకాశం దక్కింది.ఈ నేపథ్యంలో ఆమె సర్పంచ్ అభ్యర్థికి ఖరారయ్యారు.అలాగే మండలంలో ఓడి చెరువు గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా భావించి టిడిపి నాయకులు,కార్యకర్తలు అభ్యర్థిని గెలిపించే అవకాశం మెండుగా కనిపిస్తున్నాయి.ఈ సమావేశంలో భారీగా టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

ముకుమ్మడిగా ఏకతాటిపై నడుస్తాం... టిడిపి అభ్యర్థిని గెలిపించుకుంటాం

ఓడి చెరువు సర్పంచ్ అభ్యర్థిగా ఉమే షరా బేగంను బలపరిచిన టిడిపి శ్రేణులు



ఓబులదేవరచెరువు (నవంబర్13)సీమ వార్త:ఓడిచెరువు గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా ఉమేషరాబేగంను మూకుమ్మడిగా ఏ కతాటిపై నడిచి గెలిపించుకుం టామని టిడిపి శ్రేణులు ఉద్ఘాటించారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ జడ్పిటిసి పిట్టా ఓల్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం టిడిపి నాయకులు,కార్యకర్తలు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా టిడిపి శ్రేణులు ఓడి చెరువు గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిని ఏకగ్రీవంగా బలపరిచి ఎన్నుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ... గ్రామపంచాయతీ పరిధిలోని టిడిపి నాయకులు,కార్యకర్తలు,అభిమానుల సలహా, సూచనలతో అభ్యర్థిని ఎంపిక చేశామన్నారు. ఓడి చెరువు మండల కేంద్రానికి చెందిన తుమ్మల మహబూబ్ బాషా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గత 20 ఏళ్లుగా పార్టీ పనిచేస్తూ టిడిపి అభివృద్ధికి కృషి చేసారు.ఆయన సతీమణి ఉమేషరా బేగం.....ఓడి చెరువు గ్రామపంచాయతీ(బీసీ) ఉమెన్ రిజర్వేషన్ లో భాగంగా ఆమె కు అవకాశం దక్కింది.ఈ నేపథ్యంలో ఆమె సర్పంచ్ అభ్యర్థికి ఖరారయ్యారు.అలాగే మండలంలో ఓడి చెరువు గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా భావించి టిడిపి నాయకులు,కార్యకర్తలు అభ్యర్థిని గెలిపించే అవకాశం మెండుగా కనిపిస్తున్నాయి.ఈ సమావేశంలో భారీగా టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

భక్తుల ఐక్యతకు ప్రతీకగా నూతన అయ్యప్ప స్వామి ఆలయం.. వైభవంగా యజ్ఞాలు, పూజలు!







లేపాక్షి నవంబర్ 12 సీమ వార్త : మండల కేంద్రంలోని పాతూరులో నూతనంగా పునర్నిర్మించిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక యజ్ఞాలు, పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థ అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఎంతోమంది భక్తులు, దాతలు తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించి విరాళాలు ఇవ్వడంతో ఈ నూతన ఆలయ నిర్మాణం సాధ్యమైంది. గ్రామస్తుల సహకారం, భక్తుల అండదండలతో ఆలయం నూతన రూపాన్ని సంతరించుకుంది. ఆలయ నిర్మాణం కోసం గురుస్వామి శ్రీనివాసులు దగ్గరుండి ప్రతి పనిని పర్యవేక్షిస్తూ ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. కమిటీ సభ్యులు సైతం ఎంతో కష్టపడి దాతలను సమన్వయం చేసుకుంటూ ఆలయ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. ఒక్కొక్కరి సహకారం కలిస్తే గొప్ప కార్యం సాధ్యమవుతుందనే దానికి ఈ అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం నిదర్శనంగా నిలిచింది. భక్తుల విరాళాలు, గురుస్వామి శ్రీనివాసులు, కమిటీ సభ్యుల కృషితో ఆలయ నిర్మాణం పూర్తి కావడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి లేపాక్షి మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు, వివిధ రంగాల నాయకులు హాజరై స్వామివారి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అయ్యప్ప స్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది. ఆలయ అభివృద్ధికి సహకరించిన ప్రతి దాతకు, భక్తుడికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ ఎన్నికలకు బీజేపీ సిద్ధం.. ప్రతి వార్డులో కమలం వికసించాలి!



కార్యకర్తలకు అంకాల్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి దిశానిర్దేశం

తాడిపత్రి, నవంబర్ 12 సీమవార్త: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గురువారం తాడిపత్రిలోని ఏపీఆర్ ప్యారడైజ్ లో తాడిపత్రి నియోజకవర్గ పంచాయతీ ఎన్నికల నాయకుల సానహాక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగం రెడ్డి అంకాలు రెడ్డి, రాష్ట్ర లీడర్ సెల్ కన్వీనర్ పి.వి. ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు రాబోవు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి ఉండవలసిన అర్హతలు, విధి విధానాల గురించి తెలియజేశారు. ఈ పంచాయతీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ నుండి ప్రతి పంచాయతీలో పోటీ చేయడానికి ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని తెలియజేశారు. "పంచాయతీ అంటేనే పునాది.. పునాది బలంగా ఉంటేనే రాష్ట్రం బలపడుతుంది. అందుకే ప్రతి పంచాయతీలో కమలం వికసించాలి" అని అంకాలు రెడ్డి అన్నారు. ప్రతి పంచాయతీలో వార్డు మెంబర్లకు మరియు సర్పంచ్ పదవులకు పోటీ చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పోటీ చేసే అభ్యర్థులు పంచాయతీల్లో ప్రచారం మరియు పోలింగ్ ప్రక్రియ వీటన్నింటి గురించి కార్యకర్తలకు వివరించారు. నిజాయితీ, సేవా భావం, ప్రజల్లో గుర్తింపు ఉన్న కార్యకర్తలకే ప్రాధాన్యత ఇస్తామని, టికెట్ల కోసం కాకుండా గెలుపు కోసం పని చేయాలని నాయకులు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి, ప్రచారంలో ప్రజలకు వివరించాలని, బూత్ స్థాయిలో కమిటీలను బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గంగాధర్, సీనియర్ నాయకులు సింగర్ లక్ష్మీనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి రంగనాథరెడ్డి, కిసాన్ మోర్చా జోనల్ ఇంచార్జ్ తిమ్మారెడ్డి, తాడిపత్రి, పెద్దవడుగూరు, యాడికి, పెద్దపప్పూరు మండలాల అధ్యక్షులు శేషానంద రెడ్డి, రమేష్ రెడ్డి , చింతా ప్రసాద్ మరియు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంతో తాడిపత్రి నియోజకవర్గంలో బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నిండింది. పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటుతామని కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు.





పంచాయతీ ఎన్నికలకు బీజేపీ సిద్ధం.. ప్రతి వార్డులో కమలం వికసించాలి!

కార్యకర్తలకు అంకాల్ రెడ్డి దిశానిర్దేశం

తాడిపత్రి, నవంబర్ 12 సీమవార్త: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గురువారం తాడిపత్రిలోని ఏపీఆర్ ప్యారడైజ్ లో తాడిపత్రి నియోజకవర్గ పంచాయతీ ఎన్నికల నాయకుల సానహాక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగం రెడ్డి అంకాలు రెడ్డి, రాష్ట్ర లీడర్ సెల్ కన్వీనర్ పి.వి. ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వారు రాబోవు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి ఉండవలసిన అర్హతలు, విధి విధానాల గురించి తెలియజేశారు. ఈ పంచాయతీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ నుండి ప్రతి పంచాయతీలో పోటీ చేయడానికి ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని తెలియజేశారు. "పంచాయతీ అంటేనే పునాది.. పునాది బలంగా ఉంటేనే రాష్ట్రం బలపడుతుంది. అందుకే ప్రతి పంచాయతీలో కమలం వికసించాలి" అని అంకాలు రెడ్డి అన్నారు. ప్రతి పంచాయతీలో వార్డు మెంబర్లకు మరియు సర్పంచ్ పదవులకు పోటీ చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పోటీ చేసే అభ్యర్థులు పంచాయతీల్లో ప్రచారం మరియు పోలింగ్ ప్రక్రియ వీటన్నింటి గురించి కార్యకర్తలకు వివరించారు. నిజాయితీ, సేవా భావం, ప్రజల్లో గుర్తింపు ఉన్న కార్యకర్తలకే ప్రాధాన్యత ఇస్తామని, టికెట్ల కోసం కాకుండా గెలుపు కోసం పని చేయాలని నాయకులు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి, ప్రచారంలో ప్రజలకు వివరించాలని, బూత్ స్థాయిలో కమిటీలను బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గంగాధర్, సీనియర్ నాయకులు సింగర్ లక్ష్మీనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి రంగనాథరెడ్డి, కిసాన్ మోర్చా జోనల్ ఇంచార్జ్ తిమ్మారెడ్డి, తాడిపత్రి, పెద్దవడుగూరు, యాడికి, పెద్దపప్పూరు మండలాల అధ్యక్షులు శేషానంద రెడ్డి, రమేష్ రెడ్డి , చింతా ప్రసాద్ మరియు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంతో తాడిపత్రి నియోజకవర్గంలో బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నిండింది. పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటుతామని కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు.

70 ఏళ్ల వృద్ధుడిని.....కిలోమీటరు ఈడ్చుకెళ్లి..!!



పుట్టపర్తి, నవంబర్ 12 (సీమవార్త బ్యూరో) :

నల్లమాడ మండలం మీసాలవాండ్లపల్లి గ్రామంలో 70 ఏళ్ల వృద్ధుడిపై జరిగిన దాడిని శ్రీ సత్యసాయి జిల్లా యాదవ సంఘం తీవ్రంగా ఖండించింది. గురువారం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో యాదవ సంఘం నాయకులంతా, బాధితులతో కలిసి పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. వృద్ధుడిపై దాడి అమానుషమని, బాధ్యులను ఉపేక్షించకుండా నిష్పక్షపాత విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బాధితుల వివరాల ప్రకారం మీసాలవాండ్లపల్లికి చెందిన కె. కృష్ణప్ప (70) గత శనివారం బావమరిది పొలం నుంచి టమోటా చెట్లకు కట్టడానికి 4, 5 చిన్న కట్టెలు తెస్తుండగా అదే గ్రామానికి చెందిన బి. సుధాకర్ రెడ్డి (62) అడ్డుకున్నారు. "నా పొలంలో కట్టెలు దొంగతనం చేస్తున్నావా" అంటూ నిలదీసి మెడ గట్టిగా పట్టుకుని ఊపిరాడకుండా చేసి దాదాపు కిలోమీటరు దూరం రోడ్డుపై ఈడ్చుకెళ్లి పిడిగుద్దులతో కొట్టారని బాధితులు ఆరోపించారు. "ఆయన ముసలివాడు, చనిపోతాడు, వదిలేయండి" అని గ్రామస్తులు ఎంతగా వేడుకున్నా వినకుండా బలవంతంగా ఆటోలో పడేసి నిర్బంధించే ప్రయత్నం చేశారని బాధితులు వెల్లడించారు. అడ్డుకోబోయిన భార్య రమాదేవిని అసభ్య పదజాలంతో దూషించి నెట్టివేశారని స్పష్టం చేశారు. ఈ ఘటనలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయని, పోలీసులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారని వ్యక్తం చేశారు. తండ్రిని ఎందుకు కొట్టావని ప్రశ్నించిన కుమార్తె, కుమారుడిపై కూడా దాడికి ప్రయత్నించి కుటుంబాన్ని చంపుతామని బెదిరించారని బాధితులు ఆరోపించారు. తమపై తప్పుడు ఫిర్యాదులు ఇచ్చి అక్రమ కేసులు పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నిందితుడిపై పలు కేసులు ఉన్నాయని, "అవును కొట్టాను, కేసు పెట్టుకోండి" అంటూ సవాలు విసురుతున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, చిన్నపాటి కర్రల వివాదాన్ని సాకుగా చూపి వృద్ధుడిపై దాడి చేయడం దారుణమన్నారు. వృద్ధులపై దాడులను, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే చర్యలను సమాజం సహించదని అన్నారు. ఈ విషయంపై మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి బహిరంగ లేఖ రాశామని, 2013-14లో మీసాలవాండ్లపల్లి, నల్లమాడ ప్రాంతాల్లో వచ్చిన ఆరోపణలపై కూడా పునర్విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ఘటనపై రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా విచారణ జరగాలని కోరారు. సుధాకర్ రెడ్డిపై హత్యాయత్నం, అక్రమ నిర్బంధం, మహిళ పట్ల అసభ్య ప్రవర్తన, బెదిరింపు వంటి అభియోగాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని పోలీసులను కోరారు. రౌడీషీట్ తెరవాలని, తమపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేసి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమాపతి యాదవ్, నాయకులు శ్రీరాములు యాదవ్, పురుషోత్తం యాదవ్, హర్షవర్ధన్ యాదవ్, నరసింహ యాదవ్, రాజశేఖర్ యాదవ్, విష్ణువర్ధన్,ఆనంద్ యాదవ్, శివకుమార్ యాదవ్, సాయి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో ఘనంగా కూటమి విజయోత్సవ ర్యాలీ

మున్సిపల్ చైర్మన్ , 5 జడ్పీటీసీలు ఐదు ఎంపీపీలు, కైవసం!

గెలుపు మాది.. ఘనత ప్రజలది! ఐదు స్థానాల్లో క్లీన్‌స్వీప్ చేసి మా సత్తా ఏంటో చూపించాం. ప్రజల తీర్పును తప్పుపట్టే రోజులు పోయాయి.. మడకశిర గడ్డపై కూటమి జెండా ఏంటో ఐదుకి ఐదు స్థానాలు గెలిచి చరిత్ర సృష్టించాం. మా విజయమే మీ విమర్శలకు గట్టి సమాధానం





మడకశిర నవంబర్ 12 సీమ వార్త నియోజకవర్గ వ్యాప్తంగా స్థానిక ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసిన సందర్భంగా కూటమి నాయకులు శ్రేణులు భారీ విజయోత్సవ ర్యాలీ గురువారం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ జడ్పీటీసీలు కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించి కైవసం చేసుకున్న ఆనందంలో గురువారం ఈ ర్యాలీ చేపట్టారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి జ్యోతిరావు పూలే సర్కిల్ వరకు సాగిన ఈ భారీ విజయోత్సవ ర్యాలీకి స్థానిక శాసనసభ్యులు ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు , మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నాయకత్వం వహించారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల కూటమి కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ విజయోత్సవ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, మున్సిపల్ చైర్మన్ గుండుమల శారద రాధాకృష్ణ,, కుంచిటి కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, అన్ని మండలాల కన్వీనర్లు నాగరాజు, ఈరన్న, తిప్పే స్వామి, లక్ష్మీ నర్సప్ప, నాగరాజు,, సింగిల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, కుమారస్వామి, గణేష్, మర్దన కొండప్ప, నరేష్ కన్నా, ఏపీఐఐసీ డైరెక్టర్ రామకృష్ణ బీసీ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ వి ఎం పాండురంగప్ప, గుండుమల చంద్రప్ప, సురేష్ లక్ష్మి దేవమ్మ, శివ రుద్రప్ప, ప్రమీల శ్రావణి,, ఏపీఐఐసీ డైరెక్టర్ రామకృష్ణ మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్ మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు మాజీ మున్సిపల్ చైర్మన్ నరసింహారాజా మాజీ మార్కెట్ చైర్మన్ ఓబులేసులు మరియు కూటమి కార్యకర్తలు ఐదు మండలాలలో గెలిచిన ఎంపీటీసీలు కార్యకర్తలు, అభిమానులు వారి సంఖ్యలో పాల్గొన్నారు భారీ సంఖ్యలో తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేశారు.